మార్కెట్లకు ప్రత్యేక స్థలం కేటాయించాలి

- రోడ్లపై కూరగాయల విక్రయంతో ఇబ్బందుల్లో స్థానికులు, వాహనదారులు



రోడ్డుపై కూరగాయల విక్రయం

రామగుండం: పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కనే ప్రతీరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ గ్రామాల నుంచి వచ్చే మహిళలు కూరగాయలు విక్రయిస్తుంటారు. కాగా రోడ్డు పక్కనే కూర్చొని విక్రయిస్తుండడంతో ఆకుకూరలు, కూరగాయలపై వాహనాల రాకపోకలతో దుమ్ము పడుతోంది. రోడ్డుపక్కనే విక్రయిస్తుండడంతో వాహనాల రాకపోకలతో కొనుగోలుదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విక్రయాలు జరిపిన తర్వాత ఆ ప్రాంతంలో కుళ్లిపోయిన కూరగాయలు, ఇతరత్రా వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అంతేకాకుండా ఎక్కడపడితే అక్కడ చికెన్ సెంటర్లతో కూడా దుర్వాసన, పరిసరాల అపరిశుభ్రత, దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా మార్కెట్ యార్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీపీసీ తరహాలో నిర్మించాలి



ఎన్టీపీసీ, గోదావరిఖని తరహాలో స్ట్రీట్ వెండర్లందరినీ ప్రత్యేక సదుపాయాలతో కూడిన మార్కెట్ నిర్మించి విక్రయదారులందరినీ ఒకేచోటకు చేర్చడంతో కొనుగోలుదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏ సమయంలోనైనా కూరగాయలు, చికెన్, మటన్ తదితర వస్తువులు లభ్యమయ్యే అవకాశం ఉంటుంది. ప్రత్యేకంగా మార్కెట్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.
– నస్రీన్‌బేగం, మాజీ కార్పొరేటర్

నిర్మించే ఆలోచనలో ఉన్నాం



30ఏళ్ల తర్వాత ప్రధాన రోడ్డు పక్కనున్న డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయిస్తున్నారు. ఆ తర్వాత అదే రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టం డబుల్‌రోడ్డు, రైల్వేస్టేషన్ నుంచి రామగుండం బైపాస్ వరకు రహదారి విస్తరణ పనులు నడుస్తున్నాయి. మార్కెట్‌కు ప్రత్యేకంగా స్థలంలో షెడ్లు నిర్మించి అందులోనే చికెన్, మటన్, ఫిష్, కూరగాయల విక్రయదారులకు అప్పగించాలనే ఆలోచన చేస్తున్నాం. రామగుండంలో ఊహించని అభివృద్ధి చేసి చూపిస్తాను.
– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం



రామగుండం: పట్టణంలోని పలుకాలనీల్లో కుక్కల బెడదతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే కోతుల బెడద, మరో వైపు రోడ్లపై పశువుల మందలు, వీధుల్లో కుక్కల సంచారంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లే క్రమంలో, రాత్రివేళల్లో డ్యూటీలకు వెళ్లేవారు, వచ్చే వారిని వెంబడిస్తూ ప్రజలను ఆందోళనలకు గురి చేస్తున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది కుక్కలు, కోతులు, రోడ్లపై తిరిగే పశువులతో తమకు కలిగే ఇబ్బందులను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

క్లుప్తంగా

మంథనిలో దీపావళి కొనుగోళ్ల సందడి



మంథని: దీపావళి పండుగ సందర్భంగా మంథని వద్ద గోదావరికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువజాము నుంచి నదికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు నదిలో స్నానాలు ఆచరించారు. సోమవారం, మంగళవారం లక్ష్మీపూజలు, కేదారేశ్వర వ్రతాలు నిర్వహించే వారు నదిలో స్నానాలు ఆచరించి ఇసుక, నీటిని తీసుకెళ్లి శుద్ధి చేసుకోవడం సంప్రదాయంగా భావిస్తారు. ఈక్రమంలో పెద్ద సంఖ్యలో మంథనికి భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే మంథనిలో నోములకు ఉపయోగించే వస్తు సామగ్రి, కొనుగోలుతో మంథని ప్రధాన వీధులు సందడిగా మారాయి.

కల్యాణలక్ష్మి దుర్వినియోగంపై చర్యలు

మంథని: మంథనిలోని ఎరుకలగూడెంకు చెందిన మహిళ గత ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి పథకం దుర్వినియోగం చేసిన విషయంపై సమాచార హక్కు చట్టం నుంచి వచ్చిన ఆధారాలతో సదరు మహిళపై కేసు నమోదు చేశారు. మంథనికి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీశ్ కల్యాణలక్ష్మి దుర్వినియోగంపై సమాచార హక్కు చట్టం కింద ఆధారాలు సేకరించి స్థానిక ఆర్డీవో మొదలు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈనెల 14న తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సదరు మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆయన కళ్లు సజీవం


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన తుంగల మహేశ్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. అతని నేత్రాలను దానం చేయడానికి భార్య రమాదేవి, తల్లిదండ్రులు బక్కమ్మ, సమ్మయ్య తమ్ముడు సుధాకర్ ముందుకు వచ్చారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించగా జాతీయ ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుడి నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ బాధ్యులు శ్రవణ్ కుమార్, లింగమూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి అభినందించారు.

కుక్క దాడిలో భక్తుడికి గాయాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దర్శనం కోసం వచ్చిన పెద్దపల్లికి చెందిన బర్ల ప్రవీణ్‌పై కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. ప్రవీణ్ ఆదివారం మల్లన్న దర్శనం కోసం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చారు. చెట్లకింద పట్నాలు వేస్తుండగా అకస్మాత్తుగా కుక్క దాడి చేయటంతో కాళ్లపైన గాయాలయ్యాయి. చికిత్సకోసం ఓదెల పీహెచ్‌సీకి వెళ్లగా సెలవు కావడంతో బంద్ చేశారు. గతం కొంతకాలంగా మల్లన్న ఆలయం పరిసరాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో భక్తులు బెంబేలెత్తుతున్నారు.

రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోండి



పెద్దపల్లి: సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో, రోడ్డును ఆక్రమించి రెండు షెట్టర్లు నిర్మిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీతో పాటు పలు రకాల వాహనాలకు ఇబ్బందులు కలగొద్దన్న ఉద్దేశంతో రోడ్డుకు స్థలాన్ని వదిలిపెట్టారు. డ్రైనేజీతో పాటు గతంలో ప్రహరీ తొలగించి రోడ్డు ఆక్రమించి నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకొని నిర్మాణాలను వెంటనే తొలగించాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

బంతిపూల సాగులో ట్రాన్స్‌కో ఉద్యోగి


రాజమల్లు సాగుచేసిన బంతిపూల తోట

- ఎకరం భూమిలో రూ.60వేలతో సాగు
- దసరా, దీపావళి, బోనాలు, కార్తీకమాసం పూజలకు విక్రయం

ఓదెల: ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా బంతిపూల తోట సాగుచేస్తున్నాడు మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన కొల్లూరి రాజమల్లు అనే ట్రాన్స్‌కో ఉద్యోగి. ఎకరం భూమిలో హైబ్రీడ్‌సీడ్ కంపెనీకి చెందిన బంతిపూల గింజలను రూ.16వేలకు కొనుగోలు చేసి, మొత్తం రూ.60వేలతో బంతిపూలను సాగు చేస్తున్నాడు. జూలైలో బంతిపూల గింజలు నాటితే బతుకమ్మ పండుగకు, దీపావళి నోములకు, మల్లన్న బోనాలు, పట్నాలకు, అయ్యప్పస్వామి పూజలకు, కార్తీకమాసం పండుగల వరకు విక్రయానికి వస్తాయని పేర్కొన్నాడు. మహిళలు, యువత, విద్యార్థినులు సెల్ఫీ ఫొటోలు సంబర పడుతున్నారు. అలాగే బంతిపూల తోటలో షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నారు. పెద్దపల్లి జిల్లాతో పాటు సింగరేణి ప్రాంతాలకు, కరీంనగర్ వరకు విక్రయిస్తున్నట్లు వివరించారు. బంతిపూలను హోల్‌సేల్ కిలోకు రూ.60తో, రిటేల్ కిలోకు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు రాజమల్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు సబ్సిడీలో బంతిపూల గింజలను సరఫరా చేస్తే అదనంగా సాగుచేస్తానని రాజమల్లు విన్నవించారు.

ఎకరం భూమిలో సాగు..



ప్రత్యామ్నాయ పంటల మార్పిడిలో భాగంగా బంతిపూల తోట సాగుచేస్తున్న. ఏటా ఎకరం సాగుభూమిలో హైబ్రీడ్ జాతికి చెందిన బంతిపూల తోటను సాగుచేస్తున్నాను. పండుగలకు, జాతర్లకు, అయ్యప్ప భక్తులకు విక్రయిస్తున్న.
– కొల్లూరి రాజమల్లు, ట్రాన్స్‌కో ఉద్యోగి, కొలనూర్

శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


బ్రహ్మసూత్ర శివలింగానికి అలంకరణ

రామగుండం: అబాది రామగుండంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం త్రయోదశి పురస్కరించుకొని వేకువజాము, రాత్రి వేళల్లో ఆలయంలో విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి విజయకుమారాచార్యులు తెలిపారు. బ్రహ్మసూత్ర శివలింగం ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు పాటించాలి

పెద్దపల్లి: దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఈఎంఆర్ఐ స్టేట్ హెడ్ సుధాకర్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటా దీపావళికి టపాసులు పేల్చే సమయంలో అజాగ్రత్తగా ఉండడంతో చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. పిల్లలు బాంబులు పేల్చే సమయంలో పెద్దలు తప్పకుండా వారిని గమనిస్తూ ఉండాలని సూచించారు. తప్పకుండా వదులుగా ఉండే దుస్తులు ధరించాలన్నారు. బాంబులు కాల్చే సమయంలో చెప్పులు ధరించాలని, కళ్ల జోడు, మాస్క్ ధరించి బాంబులు కాల్చాలన్నారు. పండుగ సమయంలో మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఏటా ప్రమాదాల బారిన పడే వారి సంఖ్య 300కు పైగానే ఉంటుందని వివరించారు. అత్యవసర సమయాల్లో 108 సేవలను వినియోగించుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: నగరంలోని ఐబీకాలనీ శ్రీవిఘ్నేశ్వర భక్తాంజనేయస్వామి ఆలయంలో పునరుద్ధరణ అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అంబటి సంతోష్‌రావు దంపతులు పునరుద్ధరణ గావించడం సంతోషదాయకమని అభినందించారు. కార్యక్రమంలో ఈజీసీ స్టేట్ డైరెక్టర్ దండు రమేశ్, నాయకులు పీచర శ్రీనివాస్ రావు, పాపిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు భాస్కర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రమోద్‌కు కొవ్వొత్తుల నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: నిజామాబాద్‌లో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన రౌడీ షీటర్ రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ డిమాండ్ చేశాడు. ఆదివారం రాత్రి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రమోద్ చిత్రపటానికి నిర్వహించిన కొవ్వొత్తుల డిల్ నివాళి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మ్యాడగోని రవీందర్, ముష్కె సంపత్‌యాదవ్, ములుకుంట్ల శ్రీనివాస్, అడిగొప్పుల రాజు, శశికుమార్, లింగన్న, అంజన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని మెయిన్‌రోడ్డులో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆదివారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రూ.లక్షలు విలువ చేసే భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


మంత్రికి విన్నవిస్తున్న నాయకులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామ కుమ్మరి (శాలివాహన) సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. గ్రామ కుమ్మరిసంఘం యూత్ ఆధ్వర్యంలో ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి సన్మానించారు. అనంతరం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. నిధులు మంజూరీ చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని యూత్ అధ్యక్షుడు ఆవునూరి కిరణ్ తెలిపారు. సంఘం నాయకులు ఆవునూరి అమురయ్య, లచ్చయ్య, తిరుపతి, ఎల్ల య్య, యూత్ అధ్యక్షుడు ఆవునూరి కిరణ్, ఉపాధ్యక్షుడు అంజయ్య, కోశాధికారి సాయికిరణ్, నాయకులు హరీశ్, ప్రశాంత్, అజయ్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, నవీన్, మహేశ్, వంశీ, అనిల్, మోదునూరి నవీన్ పాల్గొన్నారు.

చకచకా తహసీల్ భవన నిర్మాణ పనులు



ఓదెల: ఓదెల తహసీల్ కార్యాలయం పక్కా భవన నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. తహసీల్ కార్యాలయానికి నూతన భవనం ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.50లక్షలు మంజూరు చేశారు. దీంతో రాగినేడు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పొన్నం ప్రశాంత్ టెండర్ కైవసం చేసుకొని తహసీల్ పక్కాభవన నిర్మాణ పనులు వేగవంతం చేశారు. 40ఏళ్లుగా అరకొర సౌకర్యాలతో మండల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. నూతన భవన నిర్మాణంతో ఇబ్బందులు దూరం అవుతాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీవోగా ఎంపికైన పవన్‌కు సన్మానం


పవన్‌ను సన్మానిస్తున్న మహిళలు

పెద్దపల్లి: సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్నకాలనీకి చెందిన పిట్టల పద్మ–సాగర్ దంపతుల కుమారుడు పవన్‌కుమార్ గ్రూప్–2లో సెలెక్ట్ కాగా ఎంపీవోగా ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆదివారం కాలనీలో మహిళలు, పెద్దలు అతడిని సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపిక ఉత్తర్వుల కాపీని అందుకున్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎంపీవోగా ఎంపిక చేశారని అతను తెలిపాడు. మాజీ వార్డుసభ్యులు అమిరిశెట్టి తిరుపతి, కాలనీ మహిళలు రాజేశ్వరి, రమాదేవి, శ్వేత, శారద, మౌనిక, మేఘమాల, రాధ, మనీషా, రమ్య, సుజాత పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదకరంగా చెట్లు


పుట్టపాక సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న చెట్టు


సిద్దపల్లి సమీపంలో ఎండిపోయిన వృక్షం

మంథనిరూరల్: ప్రధాన రహదారులపై మోడు వారిన చెట్లతో ప్రమాదాలు పొంచి ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్నేళ్ల క్రితం రోడ్లకి ఇరువైపులా నాటిన చెట్లు భారీ వృక్షాలై మోడువారిపోయాయి. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలోని సిద్దపల్లి సమీపంలో ఒకటి, పుట్టపాక దాటిన తర్వాత మరో చెట్టు ప్రమాదకరంగా మారాయి. ఏ క్షణాన ఎండిన చెట్లు కూలుతాయోననే ఆందోళన వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆ చెట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ లక్ష్మీనగర్ ఏరియాలో కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంటి ప్రహరీ లోపల విద్యుత్ స్తంభం ఉంది. అంతేకాకుండా విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్లాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగితే ఇళ్లపై పడి కరెంట్ షాకు తగిలే అవకాశం ఉంది. విద్యుత్ స్తంభాన్ని వేరే చోటుకు తరలించాలని ఇంటి యజమాని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాన్ని తొలగిండంతో పాటు ఇళ్లపై ఉన్న తీగలను సైతం తొలగించాలని ఏరియావాసులు కోరుతున్నారు.

క్లబ్ కార్యవర్గానికి ఆత్మీయ సన్మానం


సన్మానిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ స్వరూప

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప తదితర నేతలు సత్కరించి ఆత్మీయ సన్మానం చేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రావు, ప్రధాన కార్యదర్శి కొట్టె సదానందంతో పాటు కౌశెట్టి వేణు, కిషన్‌రెడ్డి, మహేందర్, అక్కపాక తిరుపతి, మారుతి, వీరేశ్వర్‌రావు, లింగారావు, రవిని సత్కరించారు. క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములు రామ్మూర్తి, నాయకులు బీకే జాకోటియా, మాతంగి శ్రీనివాస్, శంకర్, సాంబిరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.